విద్యా - ఉద్యోగ సమాచారం

మే రెండోవారంలో సీబీఎస్ఈ ఫలితాలు

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): సీబీఎస్ఈ ఫలితాలు మే రెండోవారంలో విడుదలయ్యే అవకాశాలున్నాయి. ఈ ఏడాది సీబీఎస్ఈ పదోతరగతి పరీక్షలు ఫిబ్రవరి 15నుంచి మార్చి 13వరకు, 12వ తరగతి పరీక్షలు ఫిబ్రవరి 15నుంచి ఏప్రిల్ 2వరకు జరిగాయి. 39లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. మే తొలి వారంలో పదోతరగతి, రెండో వారంలో 12వతరగతి ఫలితాలు విడుదల చేసే అవకాశాలున్నట్టు తెలిసింది.

5లోపు సీయూఈటీ యూజీసిటీ ఇన్ఫర్మేషన్ స్లిప్‌లు

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): సెంట్రల్ యూనివర్సిటీలు సహా ఇతర విద్యాసంస్థల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే సీయూఈటీ యూజీసిటీ ఇన్ఫర్మేషన్ స్లిప్‌లను మే 5లోపు విడుదల చేయనున్నట్టు యూజీసీ చైర్మన్, ప్రొఫెసర్ మామిడాల జగదీశ్‌కుమార్ తెలిపారు. మే రెండో వారం నుంచి అడ్మిట్‌కార్డులను అందుబాటులో ఉంచుతామన్నారు. మే 15నుంచి 24వరకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

సజావుగా గురుకుల డిగ్రీ ప్రవేశ పరీక్ష

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కొరకు ఆదివారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 87.79శాతం విద్యార్థులు హాజరయ్యారని టీజీఆర్‌డీసీ సెట్ కన్వీనర్, తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు ఒక ప్రకటనలో వెల్లడించారు. 18,989మంది దరఖాస్తు చేసుకోగా, 16564మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. బీసీ గురుకుల జూనియర్ కాలేజీల్లో ప్రవేశ పరీక్షకు 88.02శాతం విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. 47,463మంది దరఖాస్తు చేసుకోగా, 41,775మంది పరీక్ష రాశారని పేర్కొన్నారు.

పాలిసెట్ దరఖాస్తుకు రేపే ఆఖరు

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): డిప్లొమా ఇన్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పాలిసెట్ దరఖాస్తుల గడువు మంగళవారంతో ముగియనున్నది. రూ.100 ఆలస్య రుసుముతో ఈనెల 30, రూ.300 ఆలస్య రుసుముతో మే 20వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సాంకేతిక విద్యామండలి కార్యదర్శి పుల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మే 24న పాలిసెట్ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు.

జీవన్‌రెడ్డిపై ఈసీకి బీజేపీ ఫిర్యాదు

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ఎమ్మెల్సీ, నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి జీవన్‌రెడ్డిపై కేంద్ర ఎన్నికల సంఘానికి బీజేపీ ఆదివారం ఫిర్యాదు చేసింది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మార్ఫింగ్ వీడియోను జీవన్‌రెడ్డి ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారని పేర్కొన్నది. అమిత్‌షా మాట్లాడిన వీడియోను ఎడిట్ చేసి 'కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు ఎత్తేస్తాం' అని అర్థం వచ్చేలా వీడియోను తయారుచేశారని తెలిపింది. సోషల్ మీడియాలో మార్ఫింగ్ వీడియోను వైరల్ చేస్తున్న జీవన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరింది.

తనిఖీల్లో 104 కోట్ల నగదు స్వాధీనం

7,174 లైసెన్స్‌డ్ ఆయుధాలు డిపాజిట్

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న తనిఖీల్లో భారీగా నగదు, మద్యం, డ్రగ్స్ పట్టుబడుతున్నాయి. మార్చి 16 నుంచి ఏప్రిల్ 28 వరకు రూ.104.18 కోట్లను తనిఖీ బృందాలు స్వాధీనం చేసుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 477 ఎఫ్ఎస్‌టీ, 464 ఎస్ఎస్‌టీ బృందాలు 89 సరిహద్దు చెక్‌పోస్టుల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టి అక్రమంగా తరలిస్తున్న నగదు, మద్యం, డ్రగ్స్, ఉచితాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో రూ.63.18 కోట్ల నగదు ఇప్పటికే దొరకడం కలకలం సృష్టిస్తున్నది. ఇక రూ.5.38 కోట్ల విలువైన మద్యం, రూ.7.12 కోట్ల విలువైన డ్రగ్స్, రూ.21.34 కోట్ల విలువైన ఆభరణాలు, రూ.6.91 కోట్ల విలువైన ఇతర వస్తువులును స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 7,174 లైసెన్స్‌డ్ ఆయుధాలను పోలీసులకు డిపాజిట్ చేశారు. అనధికారికంగా వెంట పెట్టుకొన్న 14 ఆయుధాలను సీజ్ చేశారు. జిలిటెన్‌స్టిక్స్, డిటోనేటర్లు, కార్టన్ బాక్స్ వంటి పలు పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.



మెదక్ జిల్లా చిన్నశంకరంపేట రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

చిన్నశంకరంపేట రోడ్‌షోకు భారీగా తరలివచ్చిన జనం

కేసీఆర్ బస్సుయాత్రతో వణుకు

హామీలపై అడిగితే తిట్లు.. లేదంటే ఒట్లు

- సవాలుకు తోకముడిచిన రేవంత్‌రెడ్డి
- కేసీఆర్ తెలంగాణ ప్రజలకు శ్రీరామరక్ష
- రోడ్‌షోలలో మాజీమంత్రి హరీశ్‌రావు

మెదక్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్రతో కాంగ్రెస్ నాయకులు గజగజ వణుకుతున్నారని, అందుకే ఎక్కడిపడితే అక్కడ దేవుని మీద ఒట్లు పెడుతున్నారని మాజీమంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆదివారం మెదక్ జిల్లాలోని చిన్నశంకరంపేట, వెల్దుర్తి, శివ్వంపేట మండలాల్లో నిర్వహించిన బీఆర్ఎస్ రోడ్‌షోలలో ఆయన పాల్గొని మాట్లాడారు. రేవంత్‌రెడ్డికి పాలన చేతకాక తిట్ల పురాణం అందుకున్నారని విమర్శించారు. తిట్లు, లేదంటే ఒట్లు తప్ప ప్రజలు, రైతుల సమస్యలపై ప్రభుత్వానికి పట్టింపు లేదని విమర్శించారు. రుణమాఫీ పేరుతో రైతులు సహా అన్ని వర్గాలను ప్రభుత్వం మోసం చేసిందని దుయ్యబట్టారు. ఆరు గ్యారెంటీలు అమలుచేస్తే రాజీనామా చేస్తానని, ఎన్నికల్లో మళ్లీ పోటీచేయబోనని సవాలు విసిరితే రేవంత్ తోకముడిచి పారిపోయారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌వి ఉద్దెర మాటలు తప్ప, ప్రజలను ఉద్ధరించింది ఏమీ లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రచారం కోసం కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లోకి వస్తే తరిమికొట్టేందుకు చీపుర్లు పట్టుకుని రెడీగా ఉండాలని, గుంపుమేస్త్రి గూబ గుయ్‌మనేలా తీర్పు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

ఓట్లలోనూ కాంగ్రెస్‌కు తరుగుపెట్టాలి

పంట ఉత్పత్తులకు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ మాటతప్పిందని హరీశ్‌రావు మండిపడ్డారు. వరి కొనుగోళ్లలో తరుగు పెడుతున్న కాంగ్రెస్‌కు ఓట్లలోనూ తరుగు పెట్టి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మెడలు వంచేది బీఆర్ఎస్ ఒక్కటేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంటు కోతలు, మోటర్లు కాలుడు ప్రారంభమైందని విమర్శించారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు ఓటేస్తే నీళ్లు లేని బావిలో దూకినట్టేనని హెచ్చరించారు. ధరల పెంపు, మత రాజకీయాలు తప్ప అభివృద్ధి, తెలంగాణ ప్రయోజనాలకు ఆ పార్టీకి పట్టవని హరీశ్‌రావు విమర్శించారు.

కేసీఆరే శ్రీరామరక్ష

తెలంగాణ ప్రయోజనాలను కాపాడేది బీఆర్ఎస్ మాత్రమేనని, ప్రజలకు కేసీఆరే శ్రీరామ రక్ష అని హరీశ్‌రావు అన్నారు. కేసీఆర్ హయాంలో బావి దగ్గర 24 గంటల కరెంటు వస్తే, ఇప్పుడు 14 గంటలు మాత్రమే వస్తున్నదని తెలిపారు. మహిళలకు కేసీఆర్ రూ.2 వేల పింఛన్ ఇస్తే, రూ. 4 వేలు ఇస్తామని చెప్పి కాంగ్రెస్ మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ. 4 వేల పెన్షన్ వచ్చిన వారు కాంగ్రెస్‌కు, రూ. 2 వేలు తీసుకుంటున్నవారు బీఆర్ఎస్‌కు ఓటెయ్యాలని కోరారు. హరీశ్‌రావు రోడ్‌షోలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నది. కాంగ్రెస్ మోసాలను వివరిస్తున్నప్పుడు మంచి స్పందన లభించింది. రోడ్‌షోలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణను నిండా ముంచిన మోదీ

- రిజర్వేషన్ల రద్దుకు కుట్ర
- రాముడి ఫొటోతో బీజేపీ ఓట్లు అడుకుంటున్నది
- ఎల్బీనగర్ రోడ్‌షోలో సీఎం రేవంత్

వనస్థలిపురం, ఏప్రిల్ 28: తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడుతూ నిండా ముంచిన వ్యక్తి ప్రధాని మోదీ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. బీజేపీకి ఓటు వేస్తే కల్లోలం సృష్టిస్తారని ఆరోపించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల రద్దుకు మోదీ కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. ఆదివారం ఎల్బీనగర్ నియోజకవర్గం వనస్థలిపురంలో మల్కాజిగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునితా మహేందర్‌రెడ్డితో కలిసి నిర్వహించిన రోడ్‌షో ఆయన మాట్లాడారు. తెలంగాణకు రావాల్సిన ఐటీఆర్ఐ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీలను రాకుండా చేసింది మోదీనే అని విమర్శించారు. తల్లిని చంపి బిడ్డను బతికించారని తెలంగాణ ఉద్యమాన్ని పార్లమెంట్ సాక్షిగా అవమానించిన నరేంద్రమోదీ తెలంగాణలో ఓట్లెలా అడుగుతారని నిలదీశారు. దేవుడి పేరుతో రాజకీయం చేస్తూ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని మండిపడ్డారు. చిత్తుగా ఓడించి బుద్ధి చెప్పాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద దేవుడి ఫొటో చూపించి అడుక్కున్నట్టు, బీజేపీ రాముడి ఫొటోపెట్టి ఓట్లు అడుక్కుంటున్నదని ఎద్దేవా చేశారు. పదేండ్లుగా దేశానికి ఏం చేశారో చెప్పి ఓట్లు అడగాలని హితవు పలికారు. బీజేపీ పుట్టకముందు నుంచే అందరం రాముడిని, హనుమంతుడిని పూజిస్తున్నామని చెప్పారు. మతం పేరుతో రాజకీయం చేసి, ద్వేషం పెంచేవారిపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సునీతా మహేందర్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మెట్రోను ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్, ఇటు ఎయిర్‌పోర్టు వరకు విస్తరిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో ముంపు ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి చేస్తామని చెప్పారు. మూసీని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కిగౌడ్, రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



2035నాటికి చంద్రుడిపై రిసెర్చ్ సెంటర్: చైనా

బీజింగ్, ఏప్రిల్ 28: చంద్రుడి దక్షిణ ధ్రువంపై పరిశోధన కేంద్రం నిర్మాణానికి ప్లాన్ చేస్తున్నట్టు చైనా ప్రకటించింది. రెండు దశల్లో ఈ ప్రాజెక్ట్ చేపట్టనున్నట్టు తెలిపింది. 2035 నాటికి ఈ ప్రాజెక్ట్ తొలి దశను పూర్తి చేయాలని భావిస్తున్నట్టు చెప్పింది. 2045 నాటికి మలి దశను పూర్తి చేయాలని చైనా అంతరిక్ష పరిశోధన సంస్థ ది ఇంటర్నేషనల్ లూనార్ రిసెర్చ్ స్టేషన్ లక్ష్యంగా పెట్టుకొంది. నీడ ఆవరించి ఉండే చంద్రుడి దక్షిణ ధ్రువంలో నీళ్లు, మంచు ఉంటాయని, పరిశోధనలకు ఆ ప్రాంతం అనుకూలమని భావించిన చైనా వ్యూహాత్మకంగానే ఆ ప్రాంతంలో పరిశోధన సంస్థ నిర్మాణానికి పూనుకుంది.

సాహస బాలుడికి సీఎం అభినందన

సాయిచరణ్ సాహసానికి ముగ్ధుడైన సీఎం రేవంత్

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లా నందిగామలో ఓ ఫార్మా కంపెనీలో రెండురోజుల క్రితం సంభవించిన భారీ అగ్నిప్రమాదంలో ప్రాణాలకు తెగించి ఆరుగురిని రక్షించిన సాహస బాలుడు సాయిచరణ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. పోలీసులు, ఫైర్ ఉన్నతాధికారుల ద్వారా సాయిచరణ్ సాహసాన్ని తెలుకొన్న ముఖ్యమంత్రి ఆదివారం తన కార్యాలయానికి అతన్ని కుటుంబంతో సహా పిలిపించుకొన్నారు. సాయిచరణ్ తాడుసాయంతో ఆరుగురి కాపాడిన విధానాన్ని తెలుసుకొని రేవంత్‌రెడ్డి ముగ్ధుడయ్యారు. అనంతరం సాయిచరణ్‌ను ఘనంగా సన్మానించారు. అతడి చదువు, తల్లిదండ్రుల కుటుంబనేపథ్యం తెలుసుకొన్నారు. గత శుక్రవారం ఓ ఫార్మాకంపెనీలో సంభవించిన అగ్నిప్రమాదంలో సుమారు 50 మంది కార్మికులు మంటల్లో చిక్కుకొన్నారు. వీరిలో చాలామంది కిటికీల్లోంచి దూకి తమ ప్రాణాలు కాపాడుకొన్నారు. కొందరు బయటికి రాలేక మంటల్లోనే చిక్కుకుపోగా, సాయిచరణ్ సమయస్ఫూర్తితో వ్యవహరించి, తన ప్రాణాలకు తెగించి ఆరుగురిని కాపాడాడు. తెలివిగా ఫార్మా కంపెనీ భవనం పైకి ఎక్కి తాడు కట్టి, కిటికీలు పగలగొట్టడంతో బయటికి వచ్చిన బాధితులు.. ఆ తాడును పట్టుకొని సురక్షితంగా బయటికి రాగలిగారు. సాయిచరణ్ సాహసం గురించి తెలుసుకొన్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, పలువురు రాజకీయ నాయకులు ఎంతగానో అభినందించారు.

సాహస బాలుడు సాయిచరణ్‌ను అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

కార్.. టాప్ గేర్!

మొదటిపేజీ తరువాయి...

ఇచ్చిన తర్వాతి రోజు నుంచే మార్పు మొదలైందని, ఆ తెల్లారి నుంచి కేసీఆర్ నిర్వహిస్తున్న రోడ్‌షోలు పరిస్థితిని తల్లకిందులు చేసాయని విశ్లేషకులు భావిస్తున్నారు. చానల్ ఇంటర్వ్యూలో కేసీఆర్ పలు వివాదాస్పద అంశాలపై, తనపై, పార్టీపై ఇంతకాలం జరిగిన దుష్ప్రచారంపై స్పష్టత ఇవ్వడంతో ప్రజల్లో ఒకరకమైన రియలైజేషన్ వచ్చిందని, బీఆర్ఎస్‌ను ఓడించి తాము తప్పు చేసామా? అన్న పునరాలోచన మొదలైందని సీనియర్ పాత్రికేయుడొకరు పేర్కొన్నారు. ఇక రోడ్‌షోల్లో కేసీఆర్ సూటిగా, సుత్తి లేకుండా, సంభాషణ పూర్వకంగా ఇస్తున్న సందేశంతో జనం బీఆర్ఎస్‌కు అనుకూలంగా నిర్ణయం తీసుకోవడానికి పునాది వేస్తున్నది ఆయన వివరించారు. రోడ్‌షోల్లో కేసీఆర్ వేస్తున్న ప్రశ్నలకు ప్రజలు స్పందిస్తున్న తీరే ఇందుకు నిదర్శనమని అన్నారు. ''ఇప్పటికి ఐదు రోజుల్లో మిర్యాలగూడ, సూర్యాపేట, భువనగిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వరంగల్‌లలో ఆరు రోడ్‌షోలు జరిగాయి. వీటిని గమనించిన ఎవరైనా, లోక్‌సభ ఎన్నికల ఫలితాలు అసెంబ్లీ ఎన్నికల తరహాలో ఉండవని తేగేసి చెప్పవచ్చు'' అని ఆయన కుండబద్దలు కొట్టారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు దీన్ని గుర్తించాయి. అందుకే అవి మళ్లీ కదనోత్సాహాన్ని ప్రదర్శిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికలు అంటే అదేదో ఢిల్లీకి సంబంధించిన అంశమే కాదు; మనకు, మన రాష్ట్రానికి సంబంధించినది కూడా అనేదాన్ని ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎవరు గెలిస్తే తమకు, తెలంగాణకు లాభం జరుగుంది? అనే అంశాలపై కేసీఆర్ మాటలతో ప్రజల ఆలోచన విధానంలో మార్పు మొదలైంది అన్నది ఇప్పుడు సర్వత్రా వినిపిస్తున్న అభిప్రాయం.

అనూహ్యంగా పుంజుకున్న బీఆర్ఎస్

అసెంబ్లీ ఫలితాల తర్వాత, లోకసభ ఎన్నికల ముంగిట బీఆర్ఎస్ ప్రభావాన్ని కాంగ్రెస్, బీజేపీ చాలా తక్కువగా అంచనా వేసాయి. దీన్ని బీఆర్ఎస్ ఒక్కసారిగా తలకిందులు చేసింది. కేసీఆర్ జనంలోకి రావడం, బలమైన సందేశాన్ని ఇస్తుండడంతో పాటు కాంగ్రెస్ పరిపాలన వైఫల్యం, కరువును ఎదుర్కొనడంలో చేతగానితనం, వ్యవసాయ సంక్షోభం, రాజకీయంగా వ్యూహాత్మక తప్పిదాలు ఆ పార్టీని ఆత్మరక్షణలో పడేసాయన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ''ఈ ఎన్నికలు కూడా కేసీఆర్‌ను తిట్టి గెలవొచ్చన్న కాంగ్రెస్ వ్యూహం ఎదురు తన్నింది. పనిచేయాలని అధికారమిస్తే, కేసీఆర్‌ను తిట్టి పబ్బంగడుపుకొంటానంటే ఎట్లా? అన్నది ఇప్పుడు ప్రజలు వేస్తున్న ప్రశ్న. అదీగాక ఓవర్ కాన్ఫిడెన్స్‌తో కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాలు కూడా ఆ పార్టీ విజయావకాశాలను తీవ్రంగా ప్రభావితం చేయనున్నాయి. దాదాపు 10-11 చోట్ల ఆ పార్టీ దారుణంగా దెబ్బతినబోతున్నది. ''సికింద్రాబాద్, చేవెళ్ల, మల్కాజ్‌గిరి, వరంగల్ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు ప్రజల నుంచి కాదు; కాంగ్రెస్ క్యాడర్ నుంచే ఆమోదం లేదు. ప్రజాభిమానం కోల్పోయిన, బీఆర్ఎస్‌కు భారంగా మారిన వాళ్లను తెచ్చుకుని కాంగ్రెస్ అభ్యర్థులుగా పెట్టుకోవడం వ్యూహాత్మక తప్పిదం'' అని కాంగ్రెస్‌కే చెందిన ఒక సీనియర్ నేత విశ్లేషించారు. ''కరీంనగర్, పెద్దపల్లి, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్, మహబూబాబాద్ స్థానాల్లో కాంగ్రెస్ మూడో స్థానానికి జారిపోయింది. ఈ సీట్లలో పరిస్థితిని అంచనావేయడంలో మా పార్టీ నాయకత్వం పూర్తిగా విఫలమైంది'' అని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక ఖమ్మం అభ్యర్థి ఎంపికలోనూ కాంగ్రెస్ తప్పు చేసిందని, ఒక్కసారి మినహా ఎన్నడూ రెడ్డి సామాజిక వర్గం గెలవని ఖమ్మంలో రెడ్డికి సీట్లు ఇవ్వడం, దీనిపై మంత్రులు, సీనియర్ల మధ్య కీచులాటలు కాంగ్రెస్‌ను పెను దెబ్బ తీయబోతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఖమ్మంలో ప్రధాన సామాజికవర్గం బీఆర్ఎస్‌కే అండగా నిలవనుందని ఆయన స్పష్టంచేశారు. ''కేసీఆర్ రాజకీయ అనుభవం, విసిరిన పాచికలకు చేవెళ్ల, ఖమ్మం, వరంగల్ మంచి ఉదాహరణలు, కేసీఆర్ ఎత్తుగడలు ఆ పార్టీకి అనూహ్య లాభం కలిగించబోతున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ రెండు జాతీయ పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే ఉంటుంది. ఇందులో బీఆర్ఎస్‌కు ఏ రోల్ ఉండదనే అభిప్రాయాన్ని ఆయన పటాపంచలు చేశారు. కేసీఆర్ రాజకీయ అనుభవం, గ్రౌండ్‌ని బీఆర్ఎస్ వర్సెస్ అన్నట్టుగా మార్చివేసింది. హైదరాబాద్‌ను మినహాయిస్తే మొత్తం 16 సీట్లలో దాదాపు 10-11 చోట్ల ఇప్పుడు బీఆర్ఎస్- బీజేపీ మధ్య ప్రధాన పోటీ నెలకొనగా, నాలుగైదు చోట్ల బీఆర్ఎస్- కాంగ్రెస్ మధ్య పోటీ నెలకొంది. ఈ క్రమంలో ఎన్నికల ఫలితాల్లో బీఆర్ఎస్సే ఫస్ట్‌ప్లేస్‌లో ఉండడం ఖాయంగా కనిపిస్తున్నది. బీఆర్ఎస్ సాధించే స్థానాల్లో సగం కాంగ్రెస్, అందులో సగం బీజేపీకి వచ్చే అవకాశం ఉంది'' అని రాష్ట్ర ఎన్నికలపై కచ్చితమైన అంచనాలు ఇచ్చే సెఫాలజిస్టు ఒకరు పేర్కొన్నారు. పోలింగ్‌కు ఇంకా 15 రోజులు ఉన్నందున, వాతావరణం మరింత స్వింగ్ అవుతుందని, అదే జరిగితే బీఆర్ఎస్ సంఖ్య మరింత పెరిగి, బీజేపీ జీరో అయినా ఆశ్చర్యపోనక్కర్లేదని ఆయన అభిప్రాయపడ్డారు. ''బీజేపీ విషయంలో నెల రోజుల క్రితం ఉన్న వాతావరణం ఇప్పుడు లేదు. నాయకత్వ లోపం, బీఆర్ఎస్‌కు లయబిలిటీగా మారారనే పేరున్న (జహీరాబాద్, వరంగల్, నల్లగొండ) అభ్యర్థులను తెచ్చుకుని నిలబెట్టడం ఆ పార్టీ విశ్వసనీయతను దెబ్బతీసింది. మోదీకున్న తెలంగాణ వ్యతిరేకత, రాష్ట్రానికి పదేండ్లుగా చేసిన అన్యాయం కూడా ఆలోచనాపరులను ఆలోచింపజేస్తున్నది'' అని మరో పాత్రికేయుడు పేర్కొన్నారు.

మైనారిటీలు, దళితుల్లో పరివర్తన

అసెంబ్లీ ఎన్నికల్లో కొన్నిచోట్ల కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరించిన మైనారిటీ, దళితవర్గాలు క్రమంగా బీఆర్ఎస్ వైపు తిరిగి వస్తున్నారని క్షేత్రస్థాయి వాతావరణం స్పష్టం చేస్తున్నది. బీజేపీ గెలవకుండా చూడడమే మైనారిటీల లక్ష్యం. ప్రస్తుత పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా చూసినా, రాష్ట్రంలో చూసినా బీజేపీకి ఎదురొడ్డి నిలిచే సత్తా కాంగ్రెస్‌కు ఉన్నట్టు కనిపించడం లేదు. అందువల్ల ఈసారి మైనారిటీల ఓటు బీఆర్ఎస్‌కే పడుతుంది అని విశ్లేషకులు పేర్కొంటున్నారు. 'మేము ఏదో అనుకున్నాం. కానీ ఇలా అవుతుందని అనుకోలేదు. మీరు చేసిందే నిజం. చెప్పున్నదే వాస్తవం. ఈ ఎన్నికల్లో మేం మీ వెంటే ఉంటాం' అని మహబూబ్‌నగర్ రోడ్‌షో తర్వాత స్థానిక ముస్లిం పెద్దలు కేసీఆర్‌ను కలిసి పేర్కొనడం గమనార్హం. బలమైన ప్రాంతీయ పార్టీలు మాత్రమే బీజేపీని అడ్డుకోగలవనే అభిప్రాయం దేశవ్యాప్తంగా, ముఖ్యంగా దక్షిణాదిలో వ్యాపిస్తున్నది. దీనికి తోడు రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌కు బీజేపీతో సంబంధాలున్నాయని, ఎన్నికల తర్వాత ఆయన బీజేపీలో చేరతారని బీజేపీ నేతలే స్వయంగా ప్రకటిస్తుండడం, వీటిని ఆయన ఖండించకపోవడం కూడా మైనారిటీలను పునరాలోచనలో పడేసాయి. కర్ణాటకలో అధికారంలోకి వచ్చేందుకు అక్కడి కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలు, ప్రభుత్వంలోకి వచ్చిన తరువాత ప్రజలను విస్మరించిన తీరు, ఇప్పుడు రాష్ట్రంలోనే అదే జరుగుతుండడంతో మధ్యతరగతి, మేధావి వర్గం పునరాలోచనలో పడింది. బీజేపీని నిలువరించే శక్తి బీఆర్ఎస్‌కే ఉందని పదేండ్ల ఆ పార్టీ పాలన రుజువు చేసిందని మైనారిటీ, దళితవర్గాలు బలంగా నమ్ముతున్నాయి. కర్ణాటకకు సరిహద్దుగా ఉన్న మహబూబ్‌నగర్ జిల్లాలోని మైనారిటీ పెద్దల అభిప్రాయమే ఇందుకు ఉదాహరణ. రాష్ట్రంలోని మైనారిటీ వర్గం తిరిగి బీఆర్ఎస్‌వైపునకు మళ్లిందని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు నిర్వహిస్తున్న సమావేశాల్లో, కేసీఆర్ రోడ్‌షోల్లో మైనారిటీలే అత్యధికంగా పాల్గొంటుండడం ఆ వాదనకు బలం చేకూరుస్తున్నది. దళితుల్లో కేవలం మాల సామాజిక వర్గాన్ని, అదీ సంపన్న వర్గాన్ని మాత్రమే కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులుగా నిలిపిందని, తెలంగాణలో అత్యధికంగా ఉన్న తమను ఉద్దేశపూర్వకంగా విస్మరించిందని మాదిగ సామాజిక వర్గం ఆగ్రహంతో ఉన్నది. తమకు ఒక్కసీటు ఇవ్వరా అని మాదిగ సామాజిక వర్గం కాంగ్రెస్‌పై తిరుగుబాటును ప్రకటించింది. దళితవర్గాల్లో నిజాయితీపరుడిగా, ఉన్నతాధికారిగా సేవలు అందించి, గురుకులాలను అద్భుతంగా తీర్చిదిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ లాంటి నాయకుడు బీఆర్ఎస్‌లో నాగర్‌కర్నూల్ నుంచి, ఉద్యమకారుడు సుధీర్‌కుమార్ మాదిగ వరంగల్ నుంచి పోటీ చేస్తుండడంతో బీఆర్ఎస్‌ను మాదిగలకు దగ్గర చేసింది. దళితజాతి గర్వపడే మంద కృష్ణమాదిగ కాంగ్రెస్ పార్టీపై ఒకరకంగా యుద్ధమే ప్రకటించారు. దీంతో పరిస్థితి పూర్తిగా మారిపోయిందని, ఆ మార్పు కచ్చితంగా బీఆర్ఎస్‌వైపే తిరుగుతున్నదని, రానున్న రోజుల్లో ఇది మరింత బలోపేతమవుతుందని రాజకీయ పరిశీలకుల అంచనా.

హామీలు అమలు చేయకుంటే దిగిపో..

- సీఎం రేవంత్ రెడ్డికి కిషన్‌రెడ్డి సవాల్
- రిజర్వేషన్ల రద్దంటూ అసత్యప్రచారమని మండిపాటు

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, లేదంటే గద్దె దిగిపోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉత్త మాటలతో ప్రజలకు న్యాయం జరుగదని, ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీఎంకు చురకలంటించారు. అసెంబ్లీ ఎన్నికల్లో తొందరపడి ఓట